ఉద్యోగాల భర్తీపై విచారణకు కలెక్టర్ ఆదేశం

'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

జనగామ చౌరస్తా, నవంబర్ 7: కలెక్టరేట్‌లో 'నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాల భర్తీ' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో గురువారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్పందించారు. భూసేకరణ విభాగం యూనిట్-1లో ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నిబంధనలకు విరుద్ధంగా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా రిక్రూట్ చేయడంపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశించారు. అక్రమ నియామకాలు పొందిన ఉద్యోగులను తొలగించేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

దుప్పట్లు పంపిణీ

జనగామ చౌరస్తా, నవంబర్ 7 : జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి హమ్ సాత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలం కావడంతో నిలువ నీడలేని వృద్ధులకు కప్పుకోవడానికి దుప్పట్లు అందజేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యాకుబ్ పాషా తెలిపారు.

వ్యాక్సినేషన్‌తో టైఫాయిడ్‌కు అడ్డుకట్ట

జనగామ చౌరస్తా, నవంబర్ 7 : వ్యాక్సినేషన్‌తో పిల్లలు, పెద్దల్లో టైఫాయిడ్‌కు అడ్డుకట్ట వేయవచ్చని ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు, జనగామ లయన్స్ క్లబ్ ఆబాద్ అధ్యక్షుడు పీ నాగేశ్వరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏకశిల పబ్లిక్ స్కూల్ ఆవరణలో లయన్స్ క్లబ్, సురక్ష వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో టైఫాయిడ్ వ్యాక్సినేషన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు టైఫాయిడ్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చిర్ర ఉపేందర్‌రెడ్డి, రామకృష్ణ, సురేశ్, డాక్టర్ కార్తీక్, సంతోశ్ పాల్గొన్నారు.

దంత వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

రఘునాథపల్లి, నవంబర్ 7: మండలంలోని కోమల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హనుమకొండకు చెందిన జీఎల్ఎస్ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శేష్ కుమార్, నిభిత విద్యార్థులకు దంత పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం సాయంత్రం దంతాలు శుభ్రం చేసుకోవడం వల్ల దంతాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్ సుందర్‌రావు, ఉపాధ్యాయులు సంతోష్ రెడ్డి, పుష్ప, మాధవి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, KALVALA HARIKRISHNA REDDY S/o SADA SHIVA REDDY KALVALA R/o H.No. 4-86, Valbhapur, Veenavanka Mandal, Karimnagar Dist TG, Have Changed my name from KALVALA HARI KRISHNA To KALVALA HARIKRISHNA REDDY and Solemnly Declare.

WANTED HELPERS

jobs Apply Now!

★హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు

"హెల్పర్లు" కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం॥లు.

No Consultency, Direct Job. Contact: 9885283513.

NT-335863_All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

- ఎన్యూమరేటర్‌కు వివరాలు తెలియజేయాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, నవంబర్ 7: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు జిల్లా ప్రజలు సహకరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో సర్వేపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను చేపట్టిందని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 6వ తేదీ నుంచి 8 వరకు జిల్లాలో ఇంటింటి జాబితా రూపొందిస్తూ, ఇళ్ల తలుపులకు సర్వే స్టిక్కర్లను అంతికించనున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమై 15 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. సర్వేకు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, పర్యవేక్షణ అధికారిగా రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు మూడంచెల పర్యవేక్షణ బృందాలను నియమించినట్లు తెలిపారు. ప్రతి 150 నుంచి 175 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున సర్వే నిర్వహిస్తారని పేర్కొన్నారు. 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్, సూపర్‌వైజర్లపై మండల ప్రత్యేక అధికారులు, ప్రత్యేక అధికారులపై జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తారని వివరించారు. జనగామ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు ఐదుగురు స్పెషల్ ఆఫీసర్లు, 12 మండలాలకు 12 మంది స్పెషల్ ఆఫీసర్లను నియమించినట్లు పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కలు, ప్రజాపాలన దరఖాస్తుల ప్రకారం జిల్లాలో లక్షా 58వేల 495 ఇండ్లు ఉన్నాయని తెలిపారు. అందులో రూరల్ పరిధిలో లక్షా 42వేల 411, మున్సిపాలిటీ పరిధిలో 16,024 ఇండ్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ లెక్కన జిల్లాలో మొత్తం 1,156 ఎన్యూమరేట్ బ్లాక్‌లు గుర్తించినట్లు తెలిపారు. సర్వేలో భాగంగా ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్‌కు కుటుంబ యజమానితోపాటు ఇతర కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, ధరణి పాస్ పుస్తకం, రాజకీయ పార్టీలకు చెందిన మెంబర్‌షిప్ ఉంటే ఉందని, లేకుంటే లేదని, ఒకవేళ ప్రస్తుతం లేదా గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేస్తే ఆయా వివరాలు, సెల్‌నంబర్ తెలియజేయాలని చెప్పారు. ఎన్యూమరేటర్ అడిగే 75 ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. ఎలాంటి జిరాక్స్ పత్రాలు ఎన్యూమరేటర్‌కు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. సర్వే సమయంలో కుటుంబ సభ్యులందరూ అందుబాటులో ఉండాల్సిన అవసరం లేదని, సరైన సమాచారం ఎన్యూమరేటర్‌కు వివరించే వారు ఒక్కరు ఉన్నా సరిపోతుందన్నారు. కుటుంబ సభ్యుల్లో కొందరు విదేశాల్లో ఉన్నా, వలస పోయిన వారి వివరాలు సమర్పిస్తే ఎన్యూమరేటర్ నమోదు చేసుకుంటారని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రతి ఇంటి కుటుంబ సభ్యుల వివరాలను గోప్యంగా భద్రపరుస్తారని తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన వారు రెండు, మూడు ప్రాంతాల్లో నివసిస్తే ఏదో ఒక చోట సర్వే వివరాలు వెల్లడిస్తే సరిపోతుందని కలెక్టర్ వెల్లడించారు. డీపీఆర్వో పల్లవి, ఏడీపీ ఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్యులకు సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌రావు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో మల్లికార్జున్‌రావు

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 7 : వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్ రావు ఆదేశించారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వార్డులను తిరిగి పరిశీలించారు. అందుతున్న వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, వైద్య సౌకర్యాలు కల్పించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రాంపై ఏఎన్ఎంలతో సమీక్ష నిర్వహించి, నేషనల్ హెల్త్ ప్రోగ్రాంలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా ఆస్పత్రికి వచ్చిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోను పీహెచ్‌సీ, సీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సంధ్యారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్, జనార్దన్, ఆర్‌బీఎస్‌కే సూపర్‌వైజర్ అజయ్‌కుమార్, సంధ్య, సీహెచ్‌వో వెంకటస్వామి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, మురహరి పాల్గొన్నారు.

వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 7: వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని ఏసీపీ పార్థసారథి అన్నారు. గురువారం స్థానిక బాణాపురం ఏరియాలో ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులపై అప్రమత్తంగా ఉండడంతోపాటు అనుమానితులపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలతోపాటు అక్రమ మద్యం విక్రయించే రెండు బెల్ట్ షాప్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయంలో 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్‌క్రైమ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల బారినపడితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. అర్బన్ సీఐ పీ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

భాజాబీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

దేవరుప్పుల, నవంబర్ 7: మండలంలో మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి గురువారం పరామర్శించారు. సీతారాంపురం గ్రామానికి చెందిన మహ్మద్ భాజాబీ(85) అనారోగ్యంతో మృతిచెందింది. ఎమ్మెల్యే సందర్శించి భాజాబీ మృతదేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులు అర్పించారు. మృతురాలి కుమారుడు లియాఖత్‌అలీ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కడవెండిలో పసునూరు సంపత్ కుమారుడు రామ్‌చరణ్ ఇటీవల మృతిచెందగా కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాం, మండల మాజీ అధ్యక్షుడు ఉప్పల సురేష్‌బాబు, సీతారాంపురం మాజీ సర్పంచ్ రెడ్డిరాజుల రమేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు రతన్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల ఆర్థికసాయం

వడ్డెగూడెంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న మిత్రులు

జఫర్‌గఢ్, నవంబర్ 7: మండలంలోని వడ్డెగూడెంకు చెందిన జఫర్‌గఢ్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి బండ్ల కృష్ణ తండ్రి బండ్ల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో కృష్ణతో 2003-04లో పదోతరగతి కలిసి చదువుకున్న విద్యార్థులు గురువారం రాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. మిత్రుడు కృష్ణను, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.15వేలు అందించారు. ఎండీ ముజీబ్, బండ్ల భాస్కర్, రాజు, మ్యాకల పోచయ్య, కుల్లా రాజు, బంగారు చిరంజీవి ఉన్నారు.

దామోదర్‌ను సన్మానిస్తున్న గ్రామ పద్మశాలీ సంఘం నాయకులు

రాష్ట్ర పద్మశాలీ సంఘం జాయింట్ సెక్రటరీకి సన్మానం

చిల్పూరు, నవంబర్ 7 : తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం జాయింట్ సెక్రటరీగా మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన గజ్జల దామోదర్ ఎన్నికవగా గ్రామ పద్మశాలీ కులస్తులు శాలువాతో సన్మానించారు. కనుకుంట్ల యాదగిరి, కనుకుంట్ల నారాయణ, సామల రాములు, చిదురాల అశోక్, పేరాల రమేశ్, పేరాల నాగభూషణ్, పేరాల కోటి, గుర్రపు వెంకటేశ్వర్లు, వంగ వెంకటేశ్వర్లు, గూడూరు రమేశ్, మెరుగు సుధాకర్, మెరుగు సంతోష్, మెరుగు వెంకటేశ్వర్లు, బిట్ల సిద్ధిరాములు, గజ్జేల సోమక్క, సంబారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నత్త నడకన ధాన్యం కొనుగోళ్లు

- మొత్తం 17 సెంటర్లకు నాలుగు సెంటర్ల నుంచే తరలిన ధాన్యం
- 13 సెంటర్లలో ప్రారంభం కాని కొనుగోళ్లు

దేవునిగుట్టతండాలో పరిశీలిస్తున్న తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి

దేవరుప్పుల, నవంబర్ 7: మండలంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. గురువారం నాటికి మండలంలో 4 కేంద్రాల నుంచి ఆరు లారీల ధాన్యం తరలించినట్లు అధికారులు తెలిపారు. మిగతా 13 సెంటర్లలో ధాన్యం కుప్పలు ఉన్నా తేమ శాతం ఎక్కువ ఉందని, సన్న ధాన్యం నిర్ధారణ మిషన్లు లేవని కొనుగోళ్లు నిలిపివేస్తున్నారు. ఓ వైపు వానాకాలం సీజన్ కోతలు పూర్తి కావస్తున్నా, కొనుగోళ్లలో వేగం పెరగక పోవడంపై రైతులు ధాన్యం కుప్పలకు కాపలా కాయలేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈ ఆలస్యాన్ని గమనిస్తున్న రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు, రైస్‌మిల్లర్లకు అమ్ముకుంటున్నారు.

మండల వ్యాప్తంగా 17 సెంటర్లు

మండల వ్యాప్తంగా 17 కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రకటించగా ఐకేపీ మహిళా సంఘాల నిర్వహణలో 11 సెంటర్లు, పీఏసీఎస్ నిర్వహణలో 6 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఐకేపీ నిర్వహణలో దేవరుప్పుల కొత్తవాడ, రామరాజుపల్లి, దేవునిగుట్ట తండా, అప్పిరెడ్డిపల్లి, ధర్మాపురం, లకావత్‌తండా తూర్పు, మన్‌పహాడ్, నీర్మాల, రాంభోజీగూడెం, సీతారాంపురం, కామారెడ్డిగూడెంలలో సెంటర్లు ఏర్పాటుచేసి రెండు వారాలు గడుస్తోంది. కానీ రామరాజుపల్లి నుంచి రెండు లారీలు, దేవునిగుట్ట తండా నుంచి నాలుగు లారీల ధాన్యం తరలినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఇక పీఏసీఎస్ నిర్వహణలో ఆరు సెంటర్లు ఏర్పాటు చేయగా వీటిని సింగరాజుపల్లి, దేవరుప్పుల, పెదమడూరు, చినమడూరు, చౌడూరు, పెద తండాల్లో ప్రారంభించారు. గురువారం నాటికి సింగరాజుపల్లి నుంచి ఒక లారీ, దేవరుప్పుల నుంచి ఒక లారీ ధాన్యం తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఐకేపీ, పీఏసీఎస్ తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు మండలంలోని కడవెండి డీఎస్ రెడ్డి రైస్‌మిల్లు, దేవరుప్పులలో మల్లికార్జున రైస్‌మిల్లును అధికారులు ఎంపిక చేశారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు యశస్వినీరెడ్డి, రాంచంద్రునాయక్

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాలకుర్తి, నవంబర్ 7: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీన నిర్వహించే అఖండ జ్యోతి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినీరెడ్డి, రాంచంద్రునాయక్, భూక్య మురళీనాయక్‌తో కలిసి గురువారం తొర్రూరులో ఆవిష్కరించారు. సల్వాది మోహన్‌బాబు, అర్చకులు దేవగిరి రమేశ్‌శర్మ, లక్ష్మణ్‌శర్మ, నాగరాజ శర్మ, అనిల్‌శర్మ, కొత్తపల్లి వెంకటయ్య, ముంజాల రాములు పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాకు కృషి చేయాలి

సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

జనగామ చౌరస్తా, నవంబర్ 7: సాగునీటి సరఫరాకు అధికారులు కృషి చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్టేషన్ నియోజకవర్గం సాగునీటి నిర్వహణపై కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే కడియం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెలరోజుల్లోగా చెరువులన్నీ పూర్తి సామర్థ్యంతో ఉండేలా సాగునీటితో నింపాలని అధికారులను ఆదేశించారు. దేవాదుల ఎత్తిపోతల కాలువల ద్వారా ప్రవహిస్తున్న నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నవాబుపేట చెరువులో తుంగను, శ్రీమన్నారాయణపురం వద్ద కెనాల్ పూడికతీత తొలగించాలని తెలిపారు. కంచనపల్లి బండ్ బలహీనంగా ఉందని, దాన్ని బలోపేతం చేయాలని పేర్కొన్నారు. రాజవరం, ధర్మసాగర్ చెరువుల కింద పాత ఆయకట్టు ఉందని, దాన్ని అభివృద్ధి చేయాలన్నారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్ అశోక్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ సుధీర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుశీల, సుహాసిని పాల్గొన్నారు.

అచలయోగ ఫౌండేషన్ పదో గీతాయజ్ఞం

బచ్చన్నపేట, నవంబర్ 7 : మండల కేంద్రంలోని అచలయోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 22 వరకు పదో గీతాయజ్ఞం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు మహాయోగి శ్రీ బ్రహ్మానంద రావెలి శ్రీధర్‌స్వామి గురువారం తెలిపారు. ప్రతీ కార్తీక మాసంలో ఈ యజ్ఞం ఉంటుందని వెల్లడించారు. శ్రీమద్భగవద్గీత 12వ అధ్యాయం భక్తియోగంపై అచలరుషి వివేకానం ఆగోలు సంగయాఖ్య రాజయోగీశ్వరుల ప్రియశిష్యులైన మహాయోగి శ్రీధర్‌స్వామి వ్యాఖ్యానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని, ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

19 కిలోల గంజాయి పట్టివేత

చిల్పూరు, నవంబర్ 7 : మండలంలోని వంగపల్లి క్రాస్ రోడ్ వద్ద ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముంబైకి చెందిన కృష్ణ గోపి బంజారా, శారద గోపీ బంజార, అనుష్క నితీశ్ కాంబ్లే విశాఖపట్నంలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి తిరిగి ముంబై వెళ్లే క్రమంలో వంగపల్లి రైల్వేస్టేషన్ వద్ద సర్వీస్ రోడ్డులో గంజాయి బ్యాగులతో పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 19 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.4లక్షల 75వేలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా రూరల్ రఘునాథపల్లి శ్రీనివాస్ రెడ్డి, చిల్పూరు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో ఈషా గ్రామోత్సవం

జనగామ చౌరస్తా, నవంబర్ 7: జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఈ నెల 16, 17 తేదిల్లో ది స్పోర్టింగ్ స్పిరిట్ ఆఫ్ భారత్ పేరిట ఈషా గ్రామోత్సవం 2024 నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వలంటీర్ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల్లో వ్యసనాలను తగ్గించడం, కుల అడ్డంకులను తొలగించడం, మహిళా సాధికారత, సామాజిక పరివర్తన కోసం సంస్థ పనిచేస్తుందని పేర్కొన్నారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 16 నుంచి 75 ఏళ్ల వయసున్న వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రఘునాథపల్లి, నవంబర్ 7: మండల కేంద్రానికి చెందిన శ్రామిక సమాఖ్య పెయింటర్స్ యూనియన్ సభ్యుడు చింతకింది ఉపేందర్ తండ్రి ఎల్లయ్య బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్యతో సంఘం నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెయింటర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎడ్ల యాకస్వామి, నీలం భాస్కర్, గందమల్ల మహేశ్, కొత్తపల్లి మధు, శ్రీధర్, సురేశ్, తాళ్లపల్లి అశోక్, నాగరాజు, తిరుమల్, చెరుకు అశోక్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో చెకుముకి టాలెంట్ టెస్ట్

జనగామ రూరల్ : గిరిజన బాలుర స్కూల్‌లో చెకుముకి టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

జనగామ చౌరస్తా/జనగామ రూరల్, నవంబర్ 7: జిల్లాలోని పలు పాఠశాలల్లో గురువారం చెకుముకి టాలెంట్ టెస్ట్ జరిగింది. జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు 2024లో భాగంగా 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 452 మంది గణితం, జీవశాస్త్రం, భౌతిక-రసాయన శాస్త్రం, సాంఘికశాస్త్రం టాలెంట్ టెస్ట్‌లను రాశారు. ప్రిన్సిపాల్ ఫాదర్ మరియ జోసెఫ్ పాల్గొన్నారు. పసరమడ్ల శివారులోని చంపక్ హిల్స్ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 8, 9, 10వ తరగతుల నుంచి 50మంది విద్యార్థులు ఈ టెస్టు రాశారు. 8వ తరగతి విద్యార్థి మోతీలాల్, 9వ తరగతి విద్యార్థి బాబ్జీ, 10వ తరగతి విద్యార్థి వినోద్ ప్రథమస్థానంలో నిలిచి మండల స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం లచ్చిరాంనాయక్ తెలిపారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

జనగామ చౌరస్తా, నవంబర్ 7 : జిల్లాలో గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని జనగామ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2024 జనవరి 1 నుంచి అక్టోబర్ 31 వరకు 204 గుడుంబా కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నల్లబెల్లం 6,975 కేజీలు, పటిక 2,862 కేజీలు, ఐడీ 583 లీటర్స్ పట్టుకొని, బాధ్యులైన 204 మంది నిందితులపై కేసులు నమోదు చేసి, 41 వాహనాలు సీజ్ చేసినట్లు వివరించారు. 449 మందిని బైండోవర్ చేసి నిబంధనలు ఉల్లంఘించిన 13 మంది నుంచి రూ.3.95లక్షల నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న 201 మంది బెల్ట్‌షాప్ నిర్వాహకులపై 208 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుంచి ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) 840 లీటర్లు, బీర్లు 1,347 లీటర్లు పట్టుకొని 7 వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం జాతీయ రహదారి 163పై మద్యం షాపులు (ఏ4) చట్టపరిధిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మద్యం షాపుల వద్ద మహిళలు, విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని వైన్స్ నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో మొత్తం 47 ఏ4 వైన్స్‌లు, 5 బార్ అండ్ రెస్టారెంట్స్ ఉన్నాయని, వీటిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టి నిబంధనలు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు సూపరింటెండెంట్ అనిత వెల్లడించారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

పశువుల షెడ్డును పరిశీలిస్తున్న అధికారులు

జనగామ రూరల్, నవంబర్ 7: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేసిన పనులను జాతీయ స్థాయి సభ్యులు (ఎన్ఎల్ఎం) జుబైర్ కివీస్, జెన్నీ లారెన్స్ పరిశీలించారు. గురువారం మండలంలోని పెద్దపహాడ్, ఎర్రగొల్లపహాడ్‌లో అమలు చేసిన పథకాలు, వాటికి ఖర్చయిన నిధులు అధికారులతో కలిసి కేంద్ర బృందం పరిశీలించింది. పశువుల షెడ్డు, ఫామ్ పాండ్స్, ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లు, ప్లాంటేషన్, సంపద వనాలు సీసీరోడ్లు, తదితర పనుల పురోగతిపై గ్రామస్తులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఏడీఆర్‌డీవో చంద్రశేఖర్, డీపీఎం వినీత, సీటీఏ శ్రీనివాస్‌రెడ